క్లుప్తంగా

కళలను ప్రోత్సహించాలి


కోలాటం కళాకారులతో ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ

రామచంద్రాపురం: మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే కళలను ప్రోత్సహించాలని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. శనివారం మండలంలోని కుప్పంబాదూరు పంచాయతీ ఒడ్డుకాలువ గ్రామంలో కోలాట నృత్యోత్సవ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కొలువైన మాతమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కోలాట బృందానికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులకు ప్రోత్సాహకాలు అందించి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీబ్రహ్మర్షి ఆశ్రమంలో మహారాష్ట్ర గవర్నర్


మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్‌కు స్వాగతం పలుకుతున్న తహశీల్దార్ ఉషారాణి

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మర్షి ఆశ్రమాన్ని మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఆశ్రమంలోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయం, జైన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. తహశీల్దార్ ఉషారాణి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్వీయూలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజులుగా జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పీవీ నరసయ్య ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ పాముఖ్యతను వివరించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎం.పద్మావతమ్మ, సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, కంప్యూటర్ విభాగాధిపతి జి.అంజాన్ బాబు, ప్రొఫెసర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వైభవంగా దేవరకొండపై పూజలు



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు వైభవంగా సాగాయి. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. శనివారం ఉపవాస దీక్షలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

అలరించిన రాగసుధ గానామృతం


రాగసుధ బృందం గాత్ర కచేరీ

తిరుపతి కల్చరల్: హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో ఏర్పాటు చేసిన పి.రాగసుధ గాత్ర కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. అన్నమాచార్య సంకీర్తనలను సుమధురంగా గానం చేసి సభికులను మైమరిపించారు.

ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా సురేంద్రనాయుడు


సురేంద్రనాయుడు

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎఫ్ఏసీ)గా పాలగుడి సురేంద్రనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్స్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్ఈగా ఉన్న కృష్ణారెడ్డి సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలానికి చెందిన సురేంద్రనాయుడు సీఎం చంద్రబాబునాయుడుకు సన్నిహితుడనే పేరుంది. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురేంద్రనాయుడు ఎస్ఈగా నియమితులు కావడం గమనార్హం.

కొండంత రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రికి తిరుమల పరిసరాలు కిటకిటలాడాయి. అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఎక్కడ చూసినా బారులు తీరిన క్యూలే కనిపిస్తున్నాయి. సోమవారం వరకు వారాంతపు సెలవుల నేపథ్యంలో రద్దీ నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

- తిరుమల


అఖిలాండం వద్ద భక్తుల రద్దీ


పాపనాశనం రోడ్డు వద్ద నుంచి వైకుంఠ క్యూ కాంప్లెక్స్ వద్ద వరకు కూర్చుని ఉన్న భక్తులు


ఆస్థాన మండపం వద్ద భక్తుల రద్దీ



నందకం వద్ద నుండి పురోహిత సంఘం వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు, మాడవీధుల్లో కూర్చుండిపోయిన భక్తులు

సాహిత్య ప్రజా చైతన్యానికి పునాది శ్రీశ్రీ




శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి నేతలు, శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు, నిర్వాహకులు, రచయితలు, హాజరైన భాషాభిమానులు

తిరుపతి కల్చరల్: మహాకవి శ్రీశ్రీ సాహిత్యం సమాజ మార్పు కోసం ప్రజా చైతన్యానికి పునాది వంటిదని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కొనియాడారు. శనివారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశ్రీ దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తమ కవితల ద్వారా ఖండ కావ్యాల ద్వారా, రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పుతూ తన వంతు కృషి చేశారని గుర్తు చేశారు. శ్రీశ్రీ రచనలు దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారంలో ఉండాలని ప్రతి ఒక్కరూ చదవాలని, పాఠశాలల్లో శ్రీశ్రీ సాహిత్యాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శినాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, వైఎస్.మణి పాల్గొన్నారు.

తరతరాలకు దార్శనికుడు శ్రీశ్రీ

జనజీవన కష్టాలను ఆవిష్కరిస్తూ తన రచనలతో సమాజ మేల్కొలుపునకు తోడ్పడి తరతరాలకు దార్శనికుడుగా నిలిచి మహాకవి శ్రీశ్రీ అని పలువురు వక్తలు తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం, ఈతరం కవితా వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో మహా కవి శ్రీశ్రీ 41వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈతరం కవితా వేదిక ప్రతినిధి తోట వెంకటేశ్వర్లు, గరికపాటి రమేష్‌బాబు, టెంకాలయ దామోదరం పాల్గొని ప్రసంగించారు. శ్రీశ్రీ కవితలు ఈ సమాజాన్ని ముందుకు నడిపించే ఇంధనమన్నారు. మార్క్సిజం చదవని మార్క్సిస్టు శ్రీశ్రీ అని కొనియాడారు. శ్రీశ్రీ కవిత్వాన్ని నేటి తరానికి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సాహితీ వేత్తలు భూమన్, సాకం నాగరాజు, రచయితలు, కవులు తమటం రామచంద్రారెడ్డి, ఆకుల మల్లేశ్వర రావు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఇక వేగవంతం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ ఇంజినీర్లు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆమె ఆరా తీశారు. ప్రతి అభివృద్ధి ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె అధికారులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఇలాగే పనుల్లో ఆలస్యం జరిగితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ క్రింద భాగంలో గ్రీనరీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మోడ్రన్ స్ట్రీట్ పనుల ఆలస్యంపై ఆరా తీశారు. ఏళ్ల తరబడి పనులను ఎందుకు పూర్తి చేయలేక పోయారని మందలించారు. మురికి నీటి శుద్ధి కేంద్రం అందుబాటులోకి వచ్చిన పూర్తి స్థాయిలో నీటి శుద్ధి ప్రక్రియ జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినాయకసాగర్ పెండింగ్ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను తొలగించి మరొకరికి పనులు అప్పగించాల్సి వస్తుందని ఆమె ఇంజినీర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, అడిషనల్ కమిషన్ చరణ్ తేజ్ రెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, డీఈఈలు విజయకుమార్‌రెడ్డి, మహేష్, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, ఎయికామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నేత ఎల్.రత్నకుమార్

తిరుపతి కల్చరల్: ఎన్నికల్లో ఊహించని విజయాన్ని అందుకున్న ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో హామీలను అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎల్.రత్నకుమార్, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. మేనిఫెస్టోలోని హామీ అంశాలను అమలు చేసి ప్రజా అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. అలాగే సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై సానుకూలతతో స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కేంద్రంలోని బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు రంజిత్, శ్రీనివాసులు, అనూష, నిఖిల్ కుమార్, షఫీవుల్లా పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మోహన్‌కు సన్మానం


మాజీ ఎమ్మెల్యేకి జ్ఞాపిక అందిస్తున్న చీర్ల కిరణ్, యూనియన్ నాయకులు

తిరుపతి(అలిపిరి): తిరుపతి మాజీ ఎమ్మెల్యే, తుడా మాజీ చైర్మన్, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ మోహన్ జన్మదినం సందర్భంగా శనివారం టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉద్యోగ సంఘ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నంగారి సూరిబాబు, మదన్‌మోహన్, శ్రీహరి, రేఖ, శివ, అంకయ్య, హర్ష, రవికుమార్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు


మాట్లాడుతున్న టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి కల్చరల్: మేనిఫెస్టోలోని హామీలకు తొలి ఐదు సంతకాలతో సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. భావితరాలకు మెరుగైన భవిష్యత్ కోసం పటిష్టమైన విద్యా వ్యవస్థలో భాగంగా మెగా డీఎస్సీపై సంతకంతో ఉపాధ్యాయ నియామకాలకు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై, పేదలకు పింఛను రూ.4 వేలు పెంచుతూ మూడో సంతకం, నైపుణ్య గణనపై నాలుగో సంతకం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై ఐదో సంతకం చేసి ప్రజా సంక్షేమాన్ని కాంక్షించడం అభినందనీయమని తెలిపారు. ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తామని తెలిపారు. గతంలో ఒక్క క్యాలెండర్ ఇవ్వకుండా నిరుద్యోగులు, యువత మోసపోయారని తెలిపారు. టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, జయరామ్ యాదవ్, మనోహర్ ఆచారి, యశ్వంత్‌రెడ్డి, చెంగయ్య, మునిరాజా, గంధం బాబు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళం


దాతలను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పలువురు దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తున్నారు. రూ.3.5కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం పాకాలకు చెందిన చిటిపిరాళ్ల చెన్నకేశవులరెడ్డి రూ.1,11,116, ఐతేపల్లికి చెందిన గొబ్బిళ్ల కన్నయ్య రూ.50,116, చంద్రగిరికి చెందిన ఉపాధ్యాయుడు ధర్మినేని జగదీష్ ప్రసాద్ 50,116, చంద్రగిరికి చెందిన సంతపల్లి జయపాల్‌రెడ్డి రూ.50వేలు, పుత్తూరుకు చెందిన టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి బాలిరెడ్డి రూ.50,116 ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వారికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీసీకి అభినందనల వెల్లువ


వీసీ డి.భారతిని అభినందిస్తున్న మహిళా వర్సిటీ ఉద్యోగులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ఏడాది పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రొఫెసర్ డి.భారతిని శనివారం వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి ఆమె నిర్విరామ కృషి చేస్తోందన్నారు. ఏడాది కాలంగా వర్సిటీ అభివృద్ధికి పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఉద్యోగులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బోధనేతర సిబ్బందికి పదోన్నతి కల్పించారని పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచారని కొనియాడారు.

బక్రీద్ ఏర్పాట్లు పరిశీలన


ఈద్గా మైదానంలో బక్రీద్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: బక్రీద్ పండుగకు అవసరమైన ఏర్పాట్లు వడివడిగా సాగుతున్నాయి. ముస్లింలు అత్యంత వేడుకగా సోమవారం బక్రీద్ పండుగ జరుపుకోనున్న నేపథ్యంలో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీయూ వద్దనున్న ఈద్గా మైదానంలో పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఈద్గా మైదానం వద్దకు చేరుకుని అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముస్లిం నేతలు మహబూబ్ బాషా, రఫీ, హరున్‌బాషా, అలీబాషా, జనసేనన నేతలు అబ్బులు, ముస్లిం జేఏసీ చైర్మన్ ముర్తుజ ఈద్గా మైదానంలో చేపడుతున్న పనుల తీరును గురించి వివరించారు. బక్రీద్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మరో వైపు ఈద్గా మైదానం స్థలం రైల్వే శాఖతో ఉన్న ఇబ్బందిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి ముస్లిం నేతలు తీసుకొచ్చారు. మంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబుల దృష్టికి ఈద్గా స్థలవివాదాన్ని తీసుకెళ్లి కేంద్రంతో చర్చించి, పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎస్వీజేసీలో సినీ నటుడు సుమన్


అధ్యాపక బృందంతో సినీ నటుడు సుమన్

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రముఖ సినీ నటుడు సుమన్ శనివారం తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ ఏడాది ఆ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడంతో ప్రిన్సిపల్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. శ్రీవారి పాదాల చెంత టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీటీడీ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించడం పూర్వ జన్మ సుకృతమని, విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడి విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్లబ్ అండర్ -17 విజేత తిరుపతి


మొదటి స్థానంలో నిలిచిన తిరుపతి జట్టు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో శుక్రవారం నిర్వహించిన అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో రేణిగుంట, మూడో స్థానంలో సూళ్లూరుపేట జట్లు నిలిచాయి. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, జాయింట్ కన్వీనర్ రమేష్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

నాణ్యమైన ఆహార ఉత్పత్తే లక్ష్యం

తిరుపతి కల్చరల్: రైతుల సంక్షేమం, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు, ఆరోగ్యకర సమాజ స్థాపనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని నాబార్డ్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ మహేంద్రప్రసాద్ తెలిపారు. నాబార్డ్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో గత మూడు రోజులుగా ఏర్పాటు చేసిన నాబార్డ్ తరంగ్ మేళా శనివారం రాత్రితో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఆయన రైతులను కళాకారులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ సునీల్ గత మూడు రోజులుగా మేళాను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మెప్మా పీడీ రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, తిరుపతి లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ రెడ్డి, ప్రసాద్‌రాజు, రైతులు, కళాకారులు పాల్గొన్నారు.

పట్నంలో పల్లె పచ్చదనం



తిరునగరి చుట్టూ నగరంలోకి వచ్చే రోడ్లన్నీ అభివృద్ధి పరచడంలో గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఇందుకు అనుగుణంగా నగరం వేగంగా అభివృద్ధి చెందింది. దీంతో అంతా వాహనాల రాకపోకలు, రద్దీ వీధులు కనిపిస్తున్నాయి. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవంతుల మధ్య వరి సాగు చేస్తున్న దృశ్యాలు ఒకటో డివిజన్ తిమ్మినాయుడుపాలెం వద్ద కనిపిస్తున్నాయి. పట్నంలో పల్లె పచ్చదనం ఒలకబోస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి